క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

మోమిన్‌పేట: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డి.వసంత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమీక్షకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల, డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని చెప్పారు. ఆదే విధంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ రాష్ట్ర వికాస్ పురస్కార్ కింద ఎంపికైన పంచాయతీలకు అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన, బాలల స్నేహిత, అవసరమైన తాగునీటి సరఫరా, క్లీన్ అండ్ గ్రీన్, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహిత అనే 9 అంశాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె చెప్పారు.

త్వరలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన

కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: హిందూ వాహినీ సభ్యుల కోరిక మేరకు త్వరలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో ఛత్రపతి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. మరాఠయోధుడు, జాతి గర్వించ దగిన మహరాజు శివాజీ అని కొనియాడారు. అనంతరం కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే సందర్శించారు. కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడం పట్ల అధ్యాపకులను అభినందించారు. బీ గ్రేడు సాధించడం వలన సంతోషంగా ఉందని చెప్పారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులను ఆయన సన్మానించారు. మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ సిబ్బందికి కొత్త సిమ్‌లు




సిమ్ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ

కొడంగల్ రూరల్: ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో ముమ్మరంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. గురువారం ఎంపీడీఓ సమావేశం హాలులో ఉపాధిహామీలో పనిచేస్తున్న ఈజీఎస్ సిబ్బందికి ఆయన కొత్త సిమ్ కార్డులను పంపిణీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఏపీఓ రాములు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు సిమ్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రహతుల్లాఖాన్, పర్సాపూర్ సయ్యద్ అంజద్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలతో కేంద్రం దోస్తీ!

సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దేముల్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలతో అంటకాగుతూ.. పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు దోచి పెడుతుందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 24నుంచి 29వరకు నిర్వహించనున్న జన చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ సర్కార్ ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతోందని విమర్శించారు. అనంతరం యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాల్, లింగేష్, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఇమామ్లకు జీతాలు పెంచాలి

కొడంగల్ రూరల్: మజీద్‌లో నమాజ్ చదివించే షేక్ ఇమామ్, మౌజమ్‌లకు ప్రభుత్వం వేతనాలు పెంచాలని మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ కోరారు. గురువారం పట్టణంలోని మక్కా మజీద్‌లో మైనార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హర్యానాలో అక్కడి ప్రభుత్వం ఇమామ్లకు, మౌజామ్‌లకు రూ.14 వేల నుంచి 16వేల వేతనాలు ఇస్తోందని చెప్పారు. ఇదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఇమామ్లకు వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు పహారాలో లబ్ధిదారుల ఎంపిక

ధారూరు: పోలీసు పహారాలో మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక జరిగింది. యూనిట్లు తక్కువగా ఉండటం, దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మైనార్టీలు ఆందోళనకు దిగారు. వీరిని అదుపు చేసేందుకు ఎస్ఐ సంతోష్ తన సిబ్బందితో రావడంతో ఎవరూ ప్రశ్నించలేకపోయారు. ఆందోళన చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిని అదుపు చేయడంతో ధారూరు ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో ఆరు యూనిట్లను ఎంపిక చేశారు.

కూలీలకు వేసవి భత్యం లేనట్లే!

పని ఎక్కువ.. ఫలితం తక్కువ

- ఎన్ఎంఎంఎస్ సాఫ్ట్‌వేరే కారణం
- సరిగా నమోదు కాని వివరాలు
- నష్టపోతున్న ఉపాధి కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

దౌల్తాబాద్: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదిలో 100 రోజుల పాటు పని కల్పించాలనే లక్ష్యంతో 2005లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది. పథకం ప్రారంభం నుంచి గతేడాది వరకు రాష్ట్రానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఉపాధి పనుల వివరాలు పొందుపర్చేవారు. కానీ గతేడాది మార్చి నుంచి కేంద్రం.. ఉపాధి పనుల్లో పారదర్శకత పెంపొందించడం కోసం పనుల వివరాలు ఎన్ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయిస్తోంది. కాగా నూతన సాఫ్ట్‌వేర్‌లో అనేక చిక్కులు ఏర్పడడంతో కూలీలు నష్టపోతున్నారు.

కూలి తక్కువ..

మండలంలో 5,646 కుటుంబాలు 12,822 ఉపాధిహామీ జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. ఈ కార్డుల పరిధిలో 16,525 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఉపాధి పథకం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడు కూలీలు తక్కువ పనిచేసినా.. ఎక్కువ కూలి వచ్చేది. దీనికి తోడు ఫిబ్రవరి నుంచి జూన్ వరకు వేసవి భత్యం అదనంగా కలిపి ఇచ్చేవారు. ఈ వివరాలు టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచేవారు. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన ఆప్షన్ కానరావడం లేదు.

20శాతమే హాజరు

ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మేలో 30శాతం చొప్పున జూన్‌లో 20శాతం అదనంగా వేసవిభత్యం పేరుతో పేమెంట్ ఇచ్చేవారు. కొత్త సాఫ్ట్‌వేర్ విధానంలో వేసవి భత్యం తీసేయడంతో పాటు రెండు పూటలా పని విధానం, ఆన్‌లైన్ హాజరు నమోదులో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాంకేతిక కారణాలతో జాబ్‌కార్డు ఆధార్ అనుసంధానం కాకపోవడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో పాటు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించకపోవడంతో కూలీలు ఉపాధి పనులకు వెళ్లడానికి వెనకడుగు వేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సరాసరి 20శాతం మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్యం నెరవేరే పరిస్థితి కనిపించడంలేదు.

“పైనుంచే రావడం లేదు



గతేడాది నుంచి ఎన్ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో వేసవి భత్యానికి సంబంధించి ఎలాంటి వివరాలు రావడంలేదు. గతంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యం ఉండేది. నూతన సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యం లేకుండానే కూలీలకు వేతనాలు జమ చేస్తున్నారు.

– రజనీకాంత్, ఏపీఓ, దౌల్తాబాద్

కచ్చారోడ్డులో ప్రయాణం ఎలా?



రైల్వేట్రాక్ సమీపంలో కంకర తేలిన రోడ్డు

వికారాబాద్ అర్బన్: ఇలా కంకర తేలి ఉన్న రోడ్డులో ప్రయాణం ఎలా అని వాహనదారులు వాపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లి రోడ్డు అధ్వానంగా మారింది. గంగారం నుంచి బూర్గుపల్లి వెళ్లే బీటీరోడ్డు పూర్తిగా కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డుమీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రోడ్డు దెబ్బతినడంతో.. పరిగి రోడ్డుకు వెళ్లి ఎన్నెపల్లి మీదుగా మూడు కిలోమీటర్లు ఎక్కువైనా ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రైల్వే వంతెన నిర్మాణానికి సహకరించండి

- అవసరమైన స్థలం ఇస్తే పనులు ప్రారంభిస్తాం
- మతపెద్దలతో కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ బ్రిడ్జి నిర్మాణపు పనులు చేపట్టేందుకు సహకరించాలని క్రైస్తవ మత పెద్దలను కలెక్టర్ నారాయణ రెడ్డి కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మెథడిస్ట్ చర్చ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజా సౌకర్యార్థం రైల్వే వంతెన నిర్మాణానికి సహకరించాలని, అవసరమైన స్థలం కేటాయిస్తే పనులు ప్రారంభించేందుకు వీలు పడుతుందని ఆయన చెప్పారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ విషయంపై మత పెద్దలు త్వరగా స్పందిస్తే ఏప్రిల్ మొదటి వారంలో పనులు ప్రారంభించే అవకాశం ఉందని వెల్లడించారు. వచ్చే జూన్ మాసం తరువాత వర్షాలతో పాటు ఎన్నికల వాతావరణం మొదలవుతుందని పేర్కొన్నారు. సంప్రదింపులతో అన్ని సమస్యలు అధిగమించి, బ్రిడ్జి పనులు చేపట్టే విధంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్ వహీదాఖాతున్, ఆర్అండ్‌బీ డీఈ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా నడవాలి

- కుటీర పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కల్పించాలి
- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు టౌన్: ఆర్థిక స్వావలంబన దిశగా అతివలు అడుగులు వేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప అన్నారు. గురువారం స్థానిక విలియం మూన్ పాఠశాలలో నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత ఎంబ్రాయిడరీ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే వారి కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరుస్తాయని చెప్పారు. ఎంబ్రాయిడరీ శిక్షణా శిబిరంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, నేడు ఎంబ్రాయిడరీ వర్కు ట్రెండింగ్‌లో కొనసాగుతోందని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తుందని, ఎంబ్రాయిడరీని ఒక కుటీర పరిశ్రమగా ఏర్పాటుచేసుకుని, పది మందికి ఉపాధి కల్పించవచ్చని సూచించారు. వృత్తి నైపుణ్య శిక్షణ ద్వారా స్వతహాగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాహు శ్రీలత, శిక్షణ కేంద్రం ప్రతినిధులు ప్రవీణ్, రాంబాబు, ఆర్గనైజర్ సునిత, మెప్మా సిబ్బంది సరిత తదితరులు పాల్గొన్నారు.



ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్‌పర్సన్ దీప, శిక్షకులు

బీఆర్ఎస్‌తో అన్ని వర్గాలకు సమన్యాయం



పరిగి: లబ్ధిదారుల ఎంపిక శిబిరంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్



పెద్దేముల్: డ్రాలో పాల్గొన్న అధికారులు, నాయకులు

- సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి
- మైనార్టీలు ఆర్థికంగా ఎదగాలి
- మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. మైనార్టీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో లక్కీ డ్రా నిర్వహించారు. మొత్తం 350 మంది దరఖాస్తు చేసుకోగా.. 14 మందిని ఎంపిక చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగేశ్వర్, మునీర్, కిరణ్, వెంకటయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, మౌలానా పాల్గొన్నారు.

12 మంది ఎంపిక

పెద్దేముల్: మైనార్టీలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేస్తోందని ఎంపీపీ అనురాధ అన్నారు. రైతు వేదిక కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మప్ప ఆధ్వర్యంలో లక్కీ డ్రాలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి 12యూనిట్లను మంజూరు చేయగా.. 329 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఈ డ్రాలో నలుగురు మహిళలు, ఎనిమిది మంది పురుషులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపీపీ అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. ఎంపీఓ షేక్‌సుష్మా, సర్పంచ్ ద్యావరి విజయమ్మ, గాజీపూర్ సర్పంచ్ వీరప్ప, తట్టెపల్లి ఎంపీటీసీ శంకర్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక

తాండూరు రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ రుణాల లక్కీ డ్రా నిర్వహించారు. మొత్తం 24 యూనిట్లకు గాను 379 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందరి సమక్షంలో డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపీపీ అనితగౌడ్, జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంపీఓ రతన్ సింగ్, ఏపీఓ నరోత్తంరెడ్డి పాల్గొన్నారు.

14మంది..

అనంతగిరి: కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చంద్రకళ అన్నారు. వికారాబాద్ మండలం మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు లాటరీ పద్ధతిలో 14మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు జాఫర్, ఎంపీటీసీలు గోపాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబాన్ని ఆదుకుంటాం

- శంకర్ మృతి పార్టీకి తీరని లోటు
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల: ఎంపీటీసీ శంకర్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. చౌడాపూర్ ఎంపీటీసీ ఎల్పాటి శంకర్ అనారోగ్య సమస్యలతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం బాధిత కుటుంబీకులను కలిసి పరామర్శించి మాట్లాడారు. శంకర్ కుటుంబానికి అండగా ఉండి, పిల్లల చదువులకు అన్నివిధాలుగా సహకరిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు జుబేర్ మహమ్మద్, బీఆర్ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ఉప సర్పంచ్ శివకుమార్, నాయకులు పాల నర్సింహులు, కృష్ణయ్య, శ్రీకాంత్ రెడ్డి, మోబిన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలపర్చడానికే ఆత్మీయ సమ్మేళనం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: బీఆర్ఎస్ పార్టీని బలపర్చడానికే ఆత్మీయ సమ్మేళనమని ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం నూతన దుద్యాల మండల కేంద్రంలో 8 గ్రామ పంచాయతీల నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో పలువురు అధికార పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ దుద్యాల మండల నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, ఎల్లప్ప, బొంరాస్‌పేట మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే సహకార సంఘం లక్ష్యం

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో మందిపల్ గ్రామానికి చెందిన రైతు బసయ్య మృతిచెందగా.. సంఘంలో సభ్యత్వం ఉన్న నేపథ్యంలో గురువారం అయన కుమారుడు రాజుకు రూ.2వేలు అందజేశారు. అనంతరం నూతనంగా మండల కేంద్రంలో నిర్మిస్తున్న పీఏసీఎస్ విశ్రాంతి భవన నిర్మాణ పనులు పరిశీలించి మాట్లాడారు. సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న రైతుల్లో ఎవరైనా మృతి చెందితే.. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సీఈఓ బక్కారెడ్డి, నాయకులు ఆంజనేయులు, రవీందర్, రమేష్, నర్సింహులు, యాదయ్య స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ

అనంతగిరి: వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సంఘం అధ్యక్షులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఇప్పటివరకు నిర్మించుకున్న మరుగుదొడ్లను వాడటం, లేనివారు నిర్మించుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు సాగే శిక్షణా తరగతులను డీపీఓ తరుణ్‌కుమార్ సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, ఎంపీడీఓ సత్తయ్య, ఎస్‌బీఎం ప్రతినిధి లక్ష్మి, ఎంపీఓ, ఏపీఓ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రూ.17లక్షలతో సీసీరోడ్డు

బొంరాస్‌పేట: తుంకిమెట్లలో రూ.17లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను గురువారం ఎంపీడీఓ పాండునాయక్, ఎంపీటీసీ తిరుపతయ్య ప్రారంభించారు. గ్రామంలోని జాతీయ రహదారి నుంచి మాజీ వైస్‌ఎంపీపీ సుశీలమ్మ ఇంటి మీదుగా.. కాలనీలోకి సీసీ నిర్మాణ పనులు చేపట్టారు. మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య, మోనాచారి పాల్గొన్నారు.

వర్షాలతో వరికి తెగుళ్లు

బొంరాస్‌పేట: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ప్రధానంగా వరికి తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని ఏఓ పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరులో ఆమె వరి పంటలు పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. ఈ వర్షాలకు వరిలో ప్రధానంగా అగ్గి, గింజమచ్చ తెగులు ఆశిస్తుందని చెప్పారు. నివారణకు 1మి.లీ. ప్రోపికోనజోల్ లేదా 0.4గ్రా. తెబ్యుకోనజోల్, ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల ప్రభావం ఎక్కువగా ఉంటే వరిలో పాముపొడ, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగుళ్ల గమనించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు.

రాములోరి తలంబ్రాలకు విశేష ఆదరణ

కుల్కచర్ల: ఆర్టీసీ లాజిస్టిక్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. గురువారం కుల్కచర్ల మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో కల్యాణోత్సవ తలంబ్రాలు పొందేందుకు భక్తులు ఆర్టీసీ సిబ్బందికి డీడీలు అందజేశారు. ఇప్పటి వరకు సుమారు 200మంది డీడీలు ఇచ్చారని లాజిస్టిక్ మండల ఇన్‌చార్జి నరేందర్ చెప్పారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

కుల్కచర్ల: తడిచెత్తతో వర్మీ కంపోస్టును వృద్ధి చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో డంపింగ్ యార్డులో తడిచెత్త సహాయంతో వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించి మాట్లాడారు. వర్మీ కంపోస్టుతో రైతులకు ఉపయోగకరమైన ఎరువులను తయారీ చేయడం జరుగుతుందని చెప్పారు. సేంద్రియ ఎరువుల వలన పంటల్లో అధిగ దిగుబడి వస్తుందని తెలిపారు. ఇందుకు గ్రామస్థాయిలో తడి చెత్త సేకరించడం వలన ఇటువంటి కార్యక్రమానికి ఉపయుక్తంగా ఉంటుందని వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికే ‘మీతోనేను’

- పల్లెప్రగతితో అనేక అభివృద్ధి పనులు చేశాం
- వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మర్పల్లి: సమస్యలు గుర్తించి, వాటిని పరిష్కరించేందుకే ‘మీతోనేను’ కార్యక్రమాన్ని చేపట్టానని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. గురువారం మర్పల్లి మండల కేంద్రంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ‘మీతోనేను’ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యటిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పల్లెప్రగతిలో భాగంగా మిషన్ భగీరథ పైప్‌లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, పల్లెప్రకృతి వనం, వైకుంఠధామం, స్వచ్ఛభారత్‌లో ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి పనులు చేపట్టామని వివరించారు. మండల కేంద్రంలో పురాతన 10 ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలని, ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆన్‌ఆఫ్ సిస్టం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.

పనులు పూర్తి చేయాలి..

వారం రోజుల్లో గుర్తించిన పనులతో పాటు పారిశుద్ధ్యం పనులు చేపట్టక పోతే సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు. గ్రామాభివృద్ధి కోసం తమ నిధుల నుంచి గ్రామానికి రూ.30 లక్షలు విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. రేషన్‌కార్డు లేనివారు, పింఛన్ కోసం అర్హులైనవారు ఉంటే పంచాయతీ కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ రాజ మల్లయ్య, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, ఎంపీటీసీ సంగీత, ఏఓ వసంత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచన్న, మర్పల్లి ఉప సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే

- వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి
- డాక్టర్ జయదేవ్, క్షయ పర్యవేక్షకుడు రహత్



క్షయ అవగాహన ర్యాలీలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు

కొడంగల్ రూరల్: క్షయ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ మందులు వాడాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం తప్పదని డాక్టర్ జయదేవ్, క్షయ పర్యవేక్షకుడు రహత్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందితో నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంకాలం జ్వరం, ఆకలి మందగించడం తదితర లక్షణాలు కనిపిస్తే.. ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ.. పర్యవేక్షిస్తారని తెలిపారు. సకాలంలో సమయానుకూలంగా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే క్షయను జయించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఇటీవల నవీన ఆదర్శ ప్లే హైస్కూల్‌లో క్షయపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ప్రభు, పురుషోత్తం, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పాఠశాల ప్రిన్స్‌పాల్ నరేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.